క్లుప్తంగా

ఇసుక నిల్వల పరిశీలన

తిరువూరు: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే ఇసుకను విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తిరువూరు ఆర్డీఓ మాధురి హెచ్చరించారు. మంగళవారం తిరువూరు బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ పక్కన పెద్దఎత్తున అనధి కారికంగా నిల్వ చేసిన ఇసుకను ఆమె పరిశీలించి మాట్లాడారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

అవినాష్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను కొండపల్లి మున్సిపాల్టీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల పండు నేతృత్వంలో విజయవాడ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. అవినాష్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఏ బేగ్, కుంచం జయరాజు, బాలచందర్ పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేయాలి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ పాఠశాలకు ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేయాలని కోరుతూ కేతనకొండ ముస్లిం పెద్దలు జెడ్పీ పాఠశాల హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మూలపాడు జెడ్పీ పాఠశాలలో ఉర్దూ ప్రథమ భాషగా బోధించేందుకు స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ లేనందున ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉర్దూ భాషకు దూరమవుతున్నారని చెప్పారు.

చట్టాలపై అవగాహన

గంపలగూడెం: బాలల హక్కుల రక్షణకు ప్రభుత్వం పలు చట్టాలను అమలు చేస్తోందని జిల్లా బాలల హక్కుల సంరక్షణ సంస్థ కౌన్సిలర్ జీవన్‌కుమార్ అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంపలగూడెం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోక్సో, బాల్య వివాహాల నిషేధిత చట్టం, దత్తత చట్టాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, హెల్ప్ లైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికులు ఈనెల 8న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఇబ్రహీంపట్నంలో ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి పంపిణీ చేశారు. మండల వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల వెంకటేశ్వరరావు, పల్లెకంటి వీరయ్య పాల్గొన్నారు.

కీర్తిరాయునిగూడెంలో గ్రామ సభ

కీర్తిరాయునిగూడెం(మైలవరం): గ్రామ సభల ద్వారా రీ సర్వే భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి అన్నారు. కీర్తిరాయునిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సర్పంచ్, మండల రెవెన్యూ అధికారి, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, ఆశా వర్కర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నక్కా తిరుపతమ్మ, ప్రమీల, కల్పన, జయశ్రీ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి .నాగమణి అన్నారు. మంగళవారం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్ ఆవరణలో ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రధానోపాధ్యాయులకు స్కూల్ లీడర్ షిప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సిలబస్‌ను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, దివ్యాంగ బాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిరువూరు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారికి రూ.50వేల విలువ చేసే వెండి అభయహస్తాన్ని ఆర్యవైశ్య ప్రముఖుడు నాళ్ళా రాజారావు వితరణ ఇచ్చారు.

ప్రతిపాదనల దశలోనే పునర్నిర్మాణం

తిరువూరులోని నగర పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులు శిథిలావస్థకు చేరాయి. వర్షానికి కారుతూ శ్లాబుపెచ్చులు ఊడి పడుతున్నాయి. సౌకర్యాలు లేక దుకాణదారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటి పునర్నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

- శిథిలావస్థలో నగర పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులు
- ప్రమాదకరంగా దుకాణాలు
- దుకాణదారుల అవస్థలు
- పునర్నిర్మాణానికి నిధుల కొరత





శిథిలావస్థకు చేరిన తిరువూరు మెయిన్ రోడ్డులోని నగర పంచాయతీ దుకాణ సముదాయం ; అస్తవ్యస్తంగా ఉన్న కూరగాయల మార్కెట్ కాంప్లెక్సు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని చీరాల సెంటర్‌లో సుంకర వీరభద్రరావు కాంప్లెక్సు, బస్ డిపో వెనుక పేట బాపయ్య కూరగాయల మార్కెట్, బస్టాండు సమీపంలో మినీ కాంప్లెక్సులను 35 ఏళ్ల కిందట నిర్మించారు. మొత్తం 47 దుకాణాల ద్వారా నగర పంచాయతీకి నెలకు రూ.4 లక్షలకు పైగా ఆదాయం లభిస్తోంది. బహిరంగ వేలం ద్వారా ఈ దుకాణాలకు అద్దె వసూలు చేస్తున్న నగర పంచాయతీ వీటికి కనీస మరమ్మతులు కూడా జరిపించడం లేదు. శ్లాబు శిథిలమై వర్షాకాలంలో దుకాణదారులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కూరగాయల మార్కెట్‌లో కనీసం మరుగుదొడ్లు కూడా లేక వినియోగదారులు, దుకాణదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

అమలుకు నోచుకోని ప్రతిపాదనలు

తిరువూరు నగర పంచాయతీగా ఏర్పడిన తర్వాత పాత దుకాణ సముదాయాలను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలని పాలకవర్గం నిర్ణయించింది. పురపాలక శాఖకు ఈ మేరకు నగర పంచాయతీ నుంచి పంపిన ప్రతిపాదనలు ఇంతవరకు అమలుకు నోచలేదు. నగర పంచాయతీకి వచ్చే సాధారణ నిధులు, ప్రభుత్వ గ్రాంటు విద్యుత్ బిల్లులు, తాగునీటి సరఫరా ఖర్చులకే సరిపోకపోవడంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. మెయిన్ రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్సు గోడలు సైతం పడిపోయే స్థితిలో ఉండటంతో దుకాణదారులు ఖాళీ చేస్తున్నారు.

అసౌకర్యాల నడుమ కాలక్షేపం..

సర్దార్ పేట బాపయ్య కూరగాయల మార్కెట్‌లో నిర్మించిన దుకాణాలు గాలీ వెలుతురు లేక కొనుగోలుదారులకు, దుకాణదారులకు అసౌకర్యంగా ఉంటోంది. వర్షాకాలం ఈ కాంప్లెక్సులో శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండటంతో వ్యాపారం నిర్వహించడం దుర్లభంగా ఉందని దుకాణదారులు వాపోతున్నారు. కొందరు వ్యాపారులు తాటాకు పందిళ్లు, రేకుల షెడ్లు తాత్కాలికంగా వేసుకుని కాలక్షేపం చేస్తున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలిపివేయాల్సి వస్తోంది. కూరగాయల మార్కెట్ ఆవరణలోనే మాంసం విక్రయాలు జరుగుతుండటంతో వీటిని వేరొక చోటికి తరలించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులు కోరాం

> శిథిలమైన దుకాణ సముదాయాలను తొలగించి కొత్త భవనాల నిర్మాణానికి నగర పంచాయతీలో నిధులు లేవు. విజయవాడ పార్లమెంటు సభ్యుల గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేయాలని కోరాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.
>
> – గత్తం కస్తూరిబాయి, నగర పంచాయతీ చైర్‌పర్సన్, తిరువూరు

బహుళ అంతస్తుల నిర్మాణంతో నగర పంచాయతీకి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉన్నందున పాత భవనాల స్థానంలో కొత్త దుకాణ సముదాయాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మైలవరం చలువాది మల్లికార్జునరావు కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం జరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి జోగి రమేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై ఆర్డీఓ ఆగ్రహం



తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడు–2 సచివాలయాన్ని తిరువూరు ఆర్డీఓ మాధురి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీదారులు సచివాలయాలకు వచ్చి తమ సమస్యలు తెలియజేస్తే పరిష్కరించడంలో అలసత్వం వహించే సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యాలయం వద్ద వేచివున్న పలువురు అర్జీదారులతో ఆర్డీఓ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొందరు అర్జీదారులను ఫోనులో సంప్రదించి వారికి సచివాలయంలో సేవలు సత్వరం అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.

డీజిల్ లేక నిలిచిన 108 సేవలు

ఏలూరు జిల్లాలో నిలిచిన 12 వాహనాలు

నూజివీడు: అత్యవసర సేవలకు చిరునామాగా నిలిచే 108 వాహనాలు ఏలూరు జిల్లాలో మొత్తం 29 ఉండగా అందులో మంగళవారం నాటికి డీజిల్ లేక 12 వాహనాలు ఆయా ప్రాంతాల్లో నిలిచిపోయాయి. వాటిల్లో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, ముదినేపల్లి, కలిదిండి, కైకలూరు, మండవల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెంలకు చెందిన 108 వాహనాలు ఉన్నాయి. ఇదే పరిస్థితి మరో రోజు కొనసాగితే జిల్లాలోని మిగిలిన వాహనాలు సైతం నిలిచిపోయే ప్రమాదం ఉంది.

మూడు నెలలుగా చెల్లించని బిల్లులు

క్షతగాత్రులను, ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు చేర్చే 108 వాహనాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. మూడు నెలలుగా 108 వాహనాల నిర్వహణకు రూపాయి కూడా ప్రభుత్వం సంబంధిత ఏజెన్సీకి చెల్లించకపోవడంతో డీజిల్‌కు డబ్బులు లేక నిలిచిపోతున్నాయి. దీంతో ప్రమాదాల్లో గాయపడిన వారు, గర్భిణులు ఆస్పత్రికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లలో ఏనాడూ ఆగలేదు

గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 108 వాహనాలు ఒక్క రోజు కూడా నిలిచిపోలేదు. ఏక్షణం కాల్ వచ్చినా అర్ధరాత్రి, అపరాత్రి అనే భేదం లేకుండా క్షతగాత్రులకు 108 వాహనాలు సేవలు అందించేవి. అంతేగాకుండా గతంలో నియోజకవర్గానికి ఒకటి, రెండు 108 వాహనాలు మాత్రమే ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక 108 వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువ చేసింది. ఎక్కడైనా ప్రమాదం జరిగితే అక్కడికి 15 నిమిషాల్లో 108 అంబులెన్స్ చేరేలా చర్యలు తీసుకుంది.

నాలుగుసార్లు ఫోన్ చేసినా అంబులెన్స్ రాలేదు

చాట్రాయికి చెందిన తేళ్లూరు అశ్వితకు కడుపు నొప్పి రావడంతో ఆమె తల్లిదండ్రులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 108 వాహనానికి నాలుగు సార్లు ఫోన్ చేసినా వాహనం రాలేదు. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌కు డబ్బులు పెట్టే స్తోమత లేక చివరికి వారు బస్సులో విజయవాడ వెళ్లారు.

పెన్షనర్ల పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి

నూజివీడు: ప్రభుత్వ పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ బకాయిలను, కరువు భత్యాన్ని విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం మంగళవారం నూజివీడులో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వంగల గోవిందరావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అసోసియేషన్ నాయకులు ఈమని శేషయ్య, సోమయాజులు, రాఘవులు, కేఎస్ చలపతిరావు, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం..

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం నూజివీడులో నిర్వహించారు. పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని, డీఏ బకాయిలను విడుదల చేయాలని సంఘ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అధ్యక్షుడు బీఎం సింగ్, పలగాని పిచ్చయ్య, ఏయూఎం దిలీప్, కేవీ శేషయ్య, స్టాల్నీ ప్రభాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

ఇబ్రహీంపట్నం: నదీ పరీవాహక ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, జూపూడి, త్రిలోచనాపురం, మూలపాడు, దాములూరు, కొటికలపూడి గ్రామాల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ గ్రామాల్లోని ఇసుక రేవులకు ప్రభుత్వం అనుమతి లేదని, ఇసుక తవ్వకాలు జరుపరాదని ఈనెల 3వ తేదీన తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు ఇచ్చిన ఆదేశాలను కూటమి నాయకులు బేఖాతరు చేశారు. యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. జూపూడి, పెదలంక, చినలంక గ్రామాల నుంచి అధిక వేగంతో విచ్చలవిడిగా తిరుగుతున్న ట్రాక్టర్లను ఇబ్రహీంపట్నం ఆర్టీసీ కాలనీ వాసులు మంగళవారం అడ్డుకున్నారు. స్థానిక అవసరాల నిమిత్తం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో ఇసుక తీసుకువెళ్లచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దీన్ని ఆసరాగా తీసుకున్న ఇసుక మాఫియా యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. అధికారులు కూడా పత్రికా ముఖంగా ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది. తహసీల్దార్ ఆదేశాలను సైతం అతిక్రమించి ఇసుక రవాణా చేయడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అవినీతిపై పోరాటం విద్యార్థుల బాధ్యత

ఐఓసీఎల్ ఆపరేషన్ మేనేజర్ అనిల్ కుమార్

మైలవరం: సమాజంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం విద్యార్థుల బాధ్యత అని కొండపల్లి ఐఓసీఎల్ ఆపరేషన్ మేనేజర్ అనిల్ కుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొండపల్లి ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇంటిగ్రిటీ ప్రాధాన్యతను వివరించారు. ఐఓసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు మాట్లాడారు. సాంస్కృతిక సంపద అభివృద్ధి, జాతీయ సమైక్యత అంశంపై విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పాలు పోసి.. పూజలు చేసి



మైలవరంలో నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



నూజివీడు శివాలయంలోని పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



తిరువూరులో పూజలు చేస్తున్న భక్తులు

నాగుల చవితి పర్వదినాన్ని మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఘనంగా మంగళవారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుట్టల వద్దకు చేరుకుని పాలు పోసి పూజలు చేశారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామాల్లోని నాగేంద్రస్వామి ఆలయాలు, పాముల పుట్టల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. సంప్రదాయబద్ధంగా చిన్నారులకు చెవిపోగులు కుట్టించి కుటుంబీకులు ముచ్చట పడ్డారు.

–మైలవరం/గంపలగూడెం/ఆగిరిపల్లి/విస్సన్నపేట

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చాట్రాయి: రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. జనార్థనవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువులను తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- **కోకిలంపాడు(తిరువూరు):** ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. మండలంలోని కోకిలంపాడులో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలని, తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారని చెప్పారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం విక్రయానికి సంబంధించిన సేవలను రైతులు పొందవచ్చని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

తహసీల్దార్ ప్రశాంతి

చాట్రాయి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టు భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రశాంతి అన్నారు. మంగళవారం వలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిగ్రీ పాసైన వారు ఎన్నికల ఓటరు గుర్తింపు జిరాక్స్, డిగ్రీ ఉత్తీర్ణత జిరాక్సులతో ఈ నెల 6వ తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

5,983 అర్జీలు

నూజివీడు: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదుకు నూజివీడు నియోజకవర్గం నుంచి మంగళవారం నాటికి 5,983 అర్జీలు వచ్చాయని ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ బొందిలి రవికిరణ్ సింగ్ తెలిపారు. వీటిలో నూజివీడు నుంచి 3,097 దరఖాస్తులు, చాట్రాయి మండలం నుంచి 1,062, ముసునూరు మండలం నుంచి 873, ఆగిరిపల్లి మండలం నుంచి 951 దరఖాస్తులు అందాయన్నారు. అర్హత కలిగిన వారు వెంటనే దరఖాస్తును ఆన్‌లైన్‌లో గాని, తహసీల్దార్ కార్యాలయంలో గాని అందజేయాలన్నారు.

ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం గంపలగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ ఏఈ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగులమీరా మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చి ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారని విమర్శించారు. భవిష్యత్‌లో మరోసారి ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ఉన్న సాంబశివరావు, మండల కమిటీ సభ్యులు షేక్ కరీముల్లా, కొంగల కుటుంబరావు, జానీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** విద్యుత్ ట్రూ అప్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలని సీపీఐ మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం–1 అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అవుటర్ రింగ్ రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు

జి.కొండూరు: అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు చేపట్టిన భూ సర్వేను జి.కొండూరు మండల పరిధి కోడూరు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఎలైన్‌మెంట్‌ను మార్చి తమ పొలాల మీదుగా సర్వే చేపట్టడాన్ని తాము సహించేదిలేదన్నారు. ఇప్పటికే ఆయిల్, గ్యాస్ పైపు లైన్లు, విద్యుత్ టవర్‌లైన్లు తమ వ్యవసాయ భూముల మీదుగా వెళ్లడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఎలైన్‌మెంట్‌ను మార్చి సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు.

65 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై మంగళవారం దాడులు చేసి 65 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ముసునూరు మండలం బలివేకు చెందిన చిల్లిముంత సీతారామయ్య వద్ద 15 మద్యం సీసాలను, యల్లాపురానికి చెందిన వీరంకి నాగరాజు వద్ద 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు గడువు పెంచాలి

నూజివీడు: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల నమోదు గడువును మరో పది రోజులు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. నూజివీడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోందని, ఎంతోమంది అర్హత ఉన్నవారు ఓటరుగా నమోదు కాలేని పరిస్థితి నెలకొందన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వీరకోటి

చాట్రాయి: సీ గుడిపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరకోటి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికల్లో వీరకోటికి ఈ పదవి దక్కింది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నరసాపురం(విస్సన్నపేట): నరసాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ ఎం. నాగమణి ప్రారంభించారు. ఏఓ రాజ్యలక్ష్మి, వీఆర్వో కాంతారావు, వ్యవసాయ సహాయకురాలు ఉషారాణి, గ్రామ ప్రముఖుడు జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు,రైతులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై అధికారులకు శిక్షణ

జి.కొండూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా నిర్వహించనున్న నైపుణ్య గణన సర్వేపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి రవితేజ అధికారులకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సర్వే చేసే విధానంపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందాలి

మైలవరం: విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా ఏఐ అండ్ ఎంఎల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌లో నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్‌గా శాండ్ స్పేస్ టెక్నాలజీస్ టెక్నికల్ టీమ్ హాజరై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ అంశాలపై అవగాహన కల్పించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆగిరిపల్లి: మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ శుభశేఖర్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థి సంకా అరవింద్ రూ.10 వేలను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అందించాలని శంకరరావు కోరారు.

యురేనియం తవ్వకాలను నిలుపుదల చేయాలి

నూజివీడు: కర్నూలు జిల్లాలో యురేనియం అన్వేషణ పేరుతో తవ్వకాలు చేస్తున్నారని, దీనివలన అక్కడి ప్రజల జీవితాలు ఛిద్రమవుతాయని, కనుక తక్షణం తవ్వకాలను నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యురేనియం తవ్వకాల వల్ల 15 గ్రామాల్లో తాగు నీరు, పీల్చే గాలి, ఆహారం పండించే పంటలు సర్వనాశనమై అక్కడి ప్రజలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి రానుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి, అక్కడి ప్రజల సంక్షేమాన్ని కోరే వారైతే తక్షణమే యురేనియం తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను కేంద్రంపై ఒత్తిడి చేసి రద్దు చేయించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాశ్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంటా శ్రీనివాసరావు, వి. రూతమ్మ, వి. రమేష్, సీహెచ్ పెద్ద తిరుపతమ్మ, కె. శర్మ, టి. మేరీ, అనసూయమ్మ, తేరేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ముసునూరు: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కె.పార్థసారథి అన్నారు. సోమవారం రాత్రి కాట్రేనిపాడులో రూ.31 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ సుహాసిని, తహసీల్దార్ పురుషోత్తమ శర్మ, ఎంపీడీఓ జి.రాణి పాల్గొన్నారు.

బెల్టు దుకాణదారుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషను పరిధిలో ముగ్గురు మద్యం బెల్టు దుకాణదారులను మంగళవారం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వామకుంట్లలో బండి వెంకటేశ్వరరావు 10 మద్యం సీసాలను తెలంగాణ నుంచి తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని దాడి చేశారు. విస్సన్నపేటలో నామా వెంకటేశ్వరరావు 22 మద్యం సీసాలను బెల్టు దుకాణంలో విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అమ్మిరెడ్డిగూడెంలో బత్తుల సామ్రాజ్యం ఏడు మద్యం సీసాలతో పట్టుబడటంతో కేసులు నమోదు చేశారు.

నిబంధనలు పాటించాలి

మైలవరం: ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలోని మద్యం దుకాణాల లైసెన్సుదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మద్యం అమ్మకాల విధి విధానాలను ఆయన వివరించారు. విధి విధానాలు ఉల్లంఘించిన వారిపై మొదటి కేసుకు రూ.5లక్షలు జరిమానా విధిస్తామని చెప్పారు.